స్కెచ్

# కలగన్న విజయ

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

ఒక్కణ్ణే కూర్చున్నాను - నీలికెరటాల సముద్రాన్ని కళ్ళతో తాగేస్తూ. ప్రశాంతత మరీ దాహం వేయిస్తోంది.

ఎవ్వరూ పొరపాటుపడకపోతే రామన్ ఈ చక్కటి ఇసుకల్లోనే ఏదో ఒకరోజు కూర్చుని ఉండగా రామన్ ఎఫెక్ట్‌కి దారితీసిన ఉద్దేశం కలిగిందని చెప్తారు. ఇంత సౌందర్యాన్ని వదులుకుని, లైట్ స్కాటరింగ్ గురించీ, క్రిటికల్ ఏంగిల్స్‌గురించీ, రిఫ్రాక్షన్‌గురించీ ఆలోచించగలిగిన రామన్ చాలా గట్టివాడే ననిపించింది.

ఎక్కడో సూర్యుడు అస్తమిస్తున్నాడల్లే ఉంది-క్రమంగా దిన కాంతి తగ్గిపోతోంది. ఈ సముద్రపు నీలిమా, చెట్ల పచ్చదనమూ కలిసి చీకటిని పిలుస్తోన్నట్టుకనిపిస్తుంది-నెమ్మది నెమ్మదిగా సూర్యుడటు జారిపోతోంటే.

విచిత్రం ఏమిటంటే, అక్కడ అయిదు నిమిషాలు కూర్చున్నాక సముద్రపు హోరు వినిపించదు. అన్నీ కనిపిస్తాయ్-అంతే. అలాఅంటే, డ్రీమర్ అని తిడతారు...పూర్తిగా, అన్నీ తెలిసిపోయినవాళ్ళు.

ఎప్పుడో ఒక స్నేహితురాలు అడిగింది... "ఎప్పుడూ తిరుగుతూ ఉంటారు, చదవరేమండీ? పరీక్షలు...." అని.

"డిగ్రీ రాకపోతే---" అందామె.

"ఈ ఆనందం మిగుల్తుంది" అన్నాను.

ఆవిడకి డిగ్రీలమీద బొత్తిగా గొప్ప ఉద్దేశం ఉందని, తరువాత నన్ను సినిక్ అనో, మరేమనో ఇంకొకరితో అనేదాకా నాకు తెలీలేదు. అదంతా విన్నాక అబద్ధాలాడడం నేర్చుకోవాలని నిశ్చయించాను-అంటే, నన్ను 'నార్మల్' మనిషిగా జమకట్టి, నాదగ్గరనించి ఏ జవాబు వొస్తుందని వాళ్ళనుకుంటారో, ఆ జవాబే ఇవ్వడం....

అదంతా పిరికితనం-అంది విజయ చేతనైతే నేను చెప్పేదాన్ని ఢంకామీద దెబ్బకొట్టి చెప్పమంది. నేను గట్టిగా ఊహించుకున్నాను-అన్నిటికీ మంచిదేనని.

* * *

మార్చి అంటూ అయి, అవతలపడితే, 'మిస్ విజయ., ఎమ్. ఏ.' అని ఒక జీవిత చరిత్ర రాయాలనుకున్నాను.

సెటింగ్ చాలా బాగుంది. రేపో ఎల్లుండో పౌర్ణమిలా ఉంది - చంద్రుడు వొస్తున్నాడు. రాబోయే నా గ్రంథంలో ఓపెనింగ్ ఇక్కడే ఉండాలని అనుకున్నాను.

ఆ తరవాత?...

అలాగే కూర్చున్నాను-ఏమీతోచక. ఇంతలో హఠాత్తుగా నవ్వు వినిపించి- అమ్మాయి నవ్వు-వెనక్కి తిరిగాను. విజయే! అంత తేలికగా మరెవరు నవ్వగలరూ?

"ఏమిటే ఆలోచిస్తున్నావ్?" అన్నది-మొగలిపొదల అవతలినించి వొస్తూ కొంచెం దూరంగా కూర్చుని.

"నీ జీవితచరిత్ర రాద్దామని-ఈ దృశ్యంతో ఓపెన్ చేద్దామని-" త్వరగా అనేశాను.

"నేను బ్రతికే ఉన్నానుగా!" అంది మళ్ళా నవ్వుతూ.

"అందుకనే, నీ ప్రవృత్తులతో ఇమేజిన్ చేసి నీ ఫ్యూచర్ ఎలాఉంటుందో ఆలోచించి..."

"నవల" అంది విజయ.

"అదే..." అన్నాను.

మళ్ళా సముద్రంవైపు తిరిగాను. విజయ కట్టుకున్న ఎర్రచీరవంక చూడలేక; ఆ బ్లౌజుమీది పువ్వులంటే అసహ్యం వేసి.

"నాకు టేస్ట్స్ లేవు-" వాడిగా అంది విజయ. చప్పున వెనుదిరిగి చూశాను. తెల్లటి చీరా, నీలి బ్లౌజూ...విజయ మళ్లా ఆ అందమైన...

ఇసుక చేత్తో ఎత్తి నెమ్మదిగా పోస్తూ, "నా గురించి ఏంరాస్తావూ?" అంది.

అవును. ఏంరాయనూ?...

"నిన్ను ప్రేమించానంటాను" అన్నాను. అంత కన్న...

"ఊఁ..."

"నువ్వైతే చాలా చెడ్డదానివి. నన్ను చూడవు—"

"పాపం!"

"చివరికి..."

ఛా. ఎప్పుడూ ఇంతే... విజయ తెగనవ్వుతుంది.

"ఓ సలహా ఇచ్చేదా?" అన్నది, నేను తిన్న దెబ్బ చూసినట్లు. సీరియస్‌గా ఊరుకున్నాను.

"ప్రేమగురించి రెండువేల సంవత్సరాలనించి రాస్తున్నారు. అదీగాక, నాకూ, నీకూ ప్రేమ యేమిటి!—మరేదన్నా రాయి" అంది.

కొంచెం సేపు చంద్రుడిమీద కాన్సెంట్రేట్ చేసి ఆలోచించాను. కెరటాలు వొడ్డుకి కొట్టుకుని వెనక్కి వెళ్తొన్నా, ఆ తడి దీనంగా మెరుస్తూనే ఉంది... అటే చూస్తూంటే, చంద్రుడూ, నక్షత్రాలూ మరిచిపోయాను.

ఆ తడిలో నిలబడి నావైపుచూస్తోంది విజయ. తెల్లటిచీరా, మరీతెల్లటి నగవూ... ఈమెని గురించి ఏమిటి రాయను?

విజయ అబద్ధం ఆడదు. అందుకని ఆ కథ అక్కడే ఆపేశాను.

బాగా వెన్నెలవొచ్చింది. రాత్రి అయింది. అలాగే కూర్చున్నాను. విజయ ఇసుకలో ఆడుతూ కొంచెం దూరంగా కూర్చుంది. నాకథ ఎంత ప్రయత్నించినా సాగడంలేదు.

వెన్నెట్లో మరీ అందంగా ఉంది విజయ - నవ్వుతోన్న కలువలాగ.

"ఒకపనిచెయ్యి విజయా!" అన్నాను.

"చెప్పూ-" అంది.

"నువ్వెంత అందంగా ఉన్నావో తెలుసా?"

"ముఖ్యంగా, ఈ వెన్నెట్లో, పల్చటి ఈ తెల్ల చీరలో—కదూ?"

"అవును—"

"చెప్పుమరి"

చేతులుదులిపి బుద్ధిమంతురాలిలాగకూర్చుంది.

"నన్ను పెళ్లిచేసుకో-అప్పుడునవలసాఫీగా..."

విజయ నవ్వుతూనేఉంది. ఆపేను.

"నిన్ను పెళ్ళిచేసుకున్నాక, ఇలా విచ్చలవిడిగా తిరగనిస్తావా?" అన్నది తేలికగా.

"తప్పకుండా..." అన్నాను.

"నిన్ను నేను నమ్మను" అన్నది విజయ.

"రాసి ఇస్తాను" అన్నాను.

"అది లీగల్ డాక్యుమెంట్ అవదు-"

నిశ్శబ్దంగా ఊరుకున్నాను. కథ ఇట్లాగా నడిచేయలేదు.

"ఒకటి చెప్పేదా?" అంది గోముగా విజయ నా చేతులు తీసుకుంటూ.

"చెప్పు—" అన్నాను.

"నీ నవలని ఇలా ప్రారంభించు..."

నా చేతులు నెమ్మదిగా వొదిలి, నా కళ్ళవైపే చూస్తూ నెమ్మదిగా వెనక్కి నడువసాగింది. ఒడ్డుమీద ఒక్కసారి నిలువబడి చిన్ననవ్వు నవ్వి మరి రెండు అడుగులువేసింది. ఏదో అరుద్దామనుకున్నాను. గొంతు లొంగలేదు.

విజయ ఇంకా అలాగే నడుస్తోంది-వెనక్కి-కెరటాలలోకి. నాకళ్లు చూడగలిగేదాకా అలాగే నడిచి...సముద్రంలోనో, ఆకాశంలోనో కలిసిపోయింది.

"విజయా!"

అరిచాననుకుంటాను.

* * *

నవ్వు వినిపించింది.

"లేరా బ్రదర్!....ఎనిమిది దాటింది."

మూర్తి గొంతుక. లేచి కూర్చున్నాను.

"ఇక్కడ పడుకుని కలలు కంటున్నావు!.... డ్రీమర్!"

ఆ వెన్నెట్లో సముద్రం మరీ పొంగిపోతోంది. దూరంగా చూశాను. ఆకాశం-వెన్నెల-నీలి, నల్లరంగు వెనుక మొగలి పొద.

లేచాను. ఆ సముద్రం అలా ఎందుకు పొంగుతోందో నాకు తెలుసు....అటు చూడాలనిపించలేదు. రూముకి బయలుదేరాము. ★